సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 13 । మే । 2025



రాలిన ఆశలు... నష్టాల్లో రైతులు

ఇటీవల కురిసిన గాలివానలకు మామిడి పంట నేలరాలింది. దీంతో రైతులు నిరాశలో కూరుకుపోయారు. వివరాలు 8లో ▸



సాంకేతిక విద్య... బంగారు భవిత

పాలిటెక్నిక్ కోర్సులో చేరితే ఉపాధికి ఢోకాలేదు. నేడు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష జరగనుంది. వివరాలు 8లో ▸



భగీరథకు మోక్షం ఎప్పుడు

ఇంటింటికీ నీరు చేరాలనే లక్ష్యంతో ప్రారంభించిన మిషన్ భగీరథ జోగిపేట మున్సిపాలిటీలో అమలుకావడంలేదు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోలో ఈనెల 13వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు డిపో మేనేజర్ మల్లేశయ్య సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. డిపో పరిధిలోని ప్రయాణికులు, ప్రజలు ఆర్టీసీకి సంబంధించిన సమస్యలతోపాటు మరింత మెరుగైన సేవలు అందించడానికి సూచనలు, సలహాలను ఇవ్వడానికి **9063417161** నంబరుకు ఫోన్‌చేసి వివరించాలని సూచించారు.

జీతంపై అవగాహన ఉండాలి

ఎస్పీ పరితోశ్ పంకజ్



కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి జోన్: పోలీసు అధికారులు సిబ్బంది పోలీసు జీతం ప్యాకేజీ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. గతేడాది డిసెంబర్ 31న రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందిన హోంగార్డు మశ్చేందర్ కుటుంబానికి మంజూరైన చెక్కును బ్యాంకు అధికారులతో కలసి ఎస్పీ చేతుల మీదుగా అందించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందినందుకు రూ.30 లక్షలు, ఇద్దరి పిల్లల చదువు నిమిత్తం రూ.4లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి కల్యాణి, ఆర్ ఐ డానియల్, బ్యాంక్ మేనేజర్ రాజేందర్ తదితరులున్నారు.

ఎస్టీ గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

కంగ్టి(నారాయణఖేడ్): గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 15, 16 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని గురుకుల ప్రతిభా కళాశాల, కల్వంచలోని శాంతినగర్ భాగ్యలత కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీన బాలురకు, 16వ తేదీన బాలికలు తమకు సంబంధించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్, స్పోర్ట్స్, పీహెచ్‌సీ సర్టిఫికెట్లు, మూడు కలర్ ఫొటోలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

కొనుగోళ్లు వేగవంతం

డీఆర్‌డీఓ పీడీ జ్యోతి



రైతులతో మాట్లాడుతున్న జ్యోతి

వట్‌పల్లి(అందోల్): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా డీఆర్‌డీఓ పీడీ జ్యోతి సూచించారు. కేరూర్‌లో ఏర్పాటుచేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడగా హమాలీలు సమయానికి రాకపోవడంతో కొనుగోళ్లలో ఆలస్యం జరిగిందని తెలిపారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలని సూచించారు. తూకం చేసిన వెంటనే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు.

లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్ మంథాని

నారాయణఖేడ్: లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకునేలా చూడాలని ఖేడ్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని పోలీసు అధికారులకు సూచించారు. కోర్టులోని డివిజన్ పరిధి పోలీసు అధికారులతో సోమవారం లోక్‌అదాలత్‌పై నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి శ్రీధర్ పాల్గొని మాట్లాడారు. వచ్చేనెల 14న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, కోర్టు విధులు నిర్వర్తించే పోలీసులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలపై నజర్

ఉపాధ్యాయులకు శిక్షణ

- నేటి నుంచి నెలాఖరు వరకు
- మూడు విడతల్లో ట్రైనింగ్
- జిల్లాలో 3,630 మంది



సర్కారీ బడుల్లో కొంతమంది విద్యార్థులు చదవడం, రాయడం వంటివి కూడా చేయకపోతుండటాన్ని ఇటీవల పలు సర్వేలు వెల్లడించడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వెంటనే విద్యా ప్రమాణాల పెంపుపై విద్యాశాఖ దృష్టి పెట్టింది. విద్యార్థుల లోపాలను సరిచేసేందుకు ముందుగా ఉపాధ్యాయులకే తర్ఫీదునివ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు శిక్షణ తరగతులను నిర్వహించనుంది. ఈ శిక్షణ తరగతులతోనైనా ఈసారి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాల స్థాయికి చేరుకుంటారని సర్కారు ఆశిస్తోంది.

ఇలా శిక్షణ...

నెలాఖరు వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుండగా కటెంట్ ఎన్‌రిచ్‌మెంట్, డిజిటల్ ఎడ్యుకేషన్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, లైఫ్ స్కిల్స్, లెర్నింగ్ అవుట్ కమ్స్ వంటి విషయాలపై ఉపాధ్యాయులకు శిక్షణనిస్తారు. ఉదయం 9.30గంటల నుంచి శిక్షణ ప్రారంభం అవుతుంది. ఈ శిక్షణలో ఒకటవ తరగతి నుంచి టెన్త్ వరకు గల పాఠ్యపుస్తకాల నిర్మాణ క్రమాన్ని అర్థం చేసుకోవడం. నిరంతర సమగ్ర మూల్యాంకరణం ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల నిర్వహణ, అంశాలవారీగా విద్యా ప్రమాణాలపై అవగాహన, బోధనా వ్యూహాల పెంపు, బోధన అభ్యసన ప్రక్రియలను సమర్థవంతంగా తరగతి గదిలో అమలు, ప్రాజెక్టు వర్క్‌ల నిర్వహణ, బోధనలో అభ్యసన పరికరాల వినియోగంపై అవగాహన వంటి అంశాలపై శిక్షణనిస్తారు. ఏ ఒక్క ఉపాధ్యాయులకు శిక్షణలో మినహాయింపు లేదు.

నారాయణఖేడ్: విద్యాప్రమాణాలు పెంపొందించడం లక్ష్యంగా ఉపాధ్యాయుల శిక్షణ తరగతులకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 13 నుంచి జిల్లావ్యాప్తంగా జిల్లాలోని ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఎస్‌జీటీలకు మండల కేంద్రాలతోపాటు, స్కూల్ అసిస్టెంట్లకు జిల్లా కేంద్రంలో ఈ శిక్షణ తరగతులు ఉండనున్నాయి. ఇదివరకే ఎంపిక చేసిన జిల్లా రిసోర్స్‌పర్సన్లకు (డీఆర్పీ) రాష్ట్రస్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

పడిపోతున్న ప్రమాణాలను గుర్తించి...

కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పడిపోతున్న విషయాన్ని అందిన సర్వేల ప్రకారం విద్యాశాఖ గుర్తించింది. విద్యార్థి చదవడం, రాయడంలో కనీస ప్రమాణాలు కనిపించడం లేదని గమనించారు. ఈ అంతరాన్ని పూడ్చేందుకు ముందుగా టీచర్లలో మార్పు తేవాలని భావించింది. విద్యార్థుల స్థాయిని గుర్తించడం, వెనుకబడిన వారికి అర్థమయ్యేలా బోధన చేయడం, మారుతున్న బోధన విధానాలను అనుసరించడం, సిలబస్‌లో మార్పులను అవగతం చేసుకోవడంతోపాటు సాంకేతిక విద్యావిధానాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఢిల్లీ, కేరళ, మహారాష్ట్ర తదితర పలు రాష్ట్రాల్లో విద్యాబోధనల్లో సరికొత్త మెళకువలను అనుసరిస్తున్నారు. అదేస్థాయిలో టీచర్లలో బోధనా పటిమను పెంచేలా శిక్షణ ఇవ్వడం ద్వారా ఫలితాలు సాధించగలమని విద్యాశాఖ భావిస్తోంది.

శిక్షణకు ఏర్పాట్లు

జిల్లాలో 3,630మంది ఉపాధ్యాయులకు మూడు విడతల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈనెల 13వ తేదీ నుంచి 17 వరకు మొదటి విడత, 20 నుంచి 24వరకు రెండో విడత, 27 నుంచి 31వరకు మూడో విడత శిక్షణనివ్వనున్నారు. ఈ శిక్షణకు సబ్జెక్టుల వారీగా రిసోర్స్‌పర్సన్లను ఎంపిక చేశారు. వీరు క్షేత్రస్థాయిలో సబ్జెక్టుల వారీగా ఆయా ఎంపిక చేసిన అంశాలపై శిక్షణనిస్తారు.

శిక్షణకు ఏర్పాట్లు పూర్తి..



జిల్లాలో ఈనెల 13 నుంచి ఈనెలాఖరు వరకు ఉపాధ్యాయ శిక్షణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. మూడు విడతల్లో శిక్షణ ఇవ్వనున్నాం. ఎస్‌జీటీలకు మండల స్థాయిలో, స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలకు జిల్లా స్థాయిలో శిక్షణ ఉంటుంది. నిర్ణయించిన అంశాల వారీగా శిక్షణ కొనసాగుతుంది. ఉపాధ్యాయుల విధిగా శిక్షణకు హాజరు కావాలి.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, సంగారెడ్డి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను అధికారులకు చెప్పుకున్నారు. కాగా, ప్రజావాణిలో 73 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...ప్రజా సమస్యలు పెండింగ్‌లో ఉంచకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, డీఆర్‌ఓ పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.

నా పేరుపై భూమి మార్చండి



నా భర్త పేరుపై సర్వే నం.101.ఆలో 3.14ఎకరాలు ఉన్న వ్యవసాయ భూమిని నా పేరు మీదికి మార్చాలి. నా భర్త 19 డిసెంబర్ 2020లో మృతి చెందాడు. నా భర్త పేరుపై ఉన్న భూమిని నా పేరు పైకి మార్చాలని దరఖాస్తు చేసుకున్న. ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. అధికారులు చర్యలు తీసుకొని పేరు పైకి భూమిని మార్చాలి.

–తుల్జమ్మ, గ్రా.శేకాపూర్, మం. జహీరాబాద్

మట్టి రవాణాను అడ్డుకోవాలి



కంది మండల పరిధిలోని కవలంపేట గ్రామ శివారులోని ఊదం చెరువులో నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఇటుక బట్టీలకు చెరువు మట్టిని ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని తెలిపారు.

–కవలంపేట గ్రామస్తులు

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బల్దియా పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని..నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసే ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని ఆయన అధికారులను ఆదేశించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జీహెచ్‌ఎంసీ పరిధిలోని రామచంద్రపురం, భారతినగర్, పటాన్‌చెరు డివిజన్‌ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు డివిజన్‌ల పరిధిలో శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు.

రోడ్ల విస్తరణతోనే అభివృద్ధి సాధ్యం

ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు. చిత్రంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి

సంగారెడ్డి టౌన్/సంగారెడ్డి జోన్: కాంగ్రెస్ పార్టీ దేశ ద్రోహులకు మద్దతు ఇస్తోందని ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా కందిలోని సెంట్రల్ జైలులో జిన్నారం మత ఘర్షణలో అరెస్ట్ అయిన బీజేపీ కార్యకర్తను సోమవారం ఎంపీ పరామర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి 65 విస్తరణపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిన్నారం ఘటనలో అరెస్ట్ అయిన వారి పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారుల విస్తరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. రహదారుల విస్తరణతో అభివృద్ధికి బాటలు పడతాయన్నారు.

ఇంటర్ ప్రవేశాలు దరఖాస్తు గడువు పెంపు

పటాన్‌చెరు టౌన్: మహాత్మ జ్యోతి బాపూలే బీసీ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 17 వరకు గడువు పొడిగించినట్లు పటాన్‌చెరు మండలం ముత్తంగి ప్రిన్సిపాల్ నవనీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కల్పనకు కాంస్య పతకం



మునిపల్లి(అందోల్): తమిళనాడులోని తిరుమ లైలో ఈనెల 9 నుంచి 12 వరకు జరిగిన హెచ్‌ఎఫ్‌ఐ హ్యాండ్ బాల్ 40వ జాతీయ చాంపియన్‌షిప్ పోటీలో బుదేరా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.కల్పన కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి సోమ వారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

'తక్కువ నీటితో పంటలు పండించాలి'

పటాన్‌చెరు టౌన్: రైతులు తక్కువ నీటితో పంటలు పండించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచించారు. పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన సమావేశానికి సోమవారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మిప్రసన్న, డాక్టర్ స్పందన పాల్గొని రైతులకు సూచనలు చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



బూచినెల్లిలో బుద్ధవిహార్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్

న్యాల్‌కల్(జహీరాబాద్)/జహీరాబాద్ టౌన్: అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ స్పష్టం చేశారు. న్యాల్‌కల్‌లో ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణం పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గ్రామంలో బుద్ధ విహార్‌ను ప్రారంభించడంతోపాటుగా గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గౌతమ బుద్ధుడు చూపిన మార్గంలో నడుస్తూ మహనీయుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. న్యాల్‌కల్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని ఎంపీ తెలిపారు. ఇళ్లు కట్టుకుంటున్న వారికి ఇటీవల రూ.1లక్ష చొప్పున అందించడం జరిగిందన్నారు. లబ్ధిదారులకు దశలవారీగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం రేజింతల్ గ్రామశివారులో గల శ్రీసిద్ధివినాయక ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి దైవదర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎంపీని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ బుద్ధిష్ట సొసైటీ సభ్యులు దశరథ్, సుభాష్, బక్కప్ప, రాజ్ కుమార్, నర్సింలు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేశ్ గౌడ్, సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్, జిల్లా అధ్యక్షుడు కరణం రవి కుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షాలు నేలకొరిగి.. తీగలు తెగిపడి



రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

ఝరాసంగం మండలంలో భారీ వర్షం

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం వాతావరణంలో మార్పులేర్పడి బలమైన గాలులు వీస్తూ ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి మాచనూర్, కుప్పానగర్‌తో పాటు పలు గ్రామాల మధ్య పలుచోట్ల చెట్లు విరిగిపడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఎస్సై నరేశ్ సిబ్బందితో కలసి అక్కడకు చేరుకుని నేలకొరిగిన వృక్షాలను జేసీబీ సహాయంతో తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

పట్లోళ్ల కుంట ఆక్రమణపై పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



కుంటను పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో పట్లోళ్లకుంట శిఖం భూమి ఆక్రమణపై ఈ నెల 8న 'సాక్షి'దినపత్రికలో 'కబ్జా కోరల్లో పట్లోళ్ల కుంట'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. సోమవారం డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, ఇరిగేషన్ ఏఈ నిషిత గ్రామానికి వెళ్లి కుంటను పరిశీలించారు. కుంట పరిధిలో పంట వేసిన వారిని పిలిచి వివరాలు అడిగారు. రెండు రోజుల్లో సర్వే చేసి కుంట శిఖం భూమి ఎక్కడెక్కడ విస్తరించి ఉన్నదనే విషయాన్ని గుర్తిస్తామని అధికారులు తెలిపారు.

సర్వేయర్ల కొరతకు చెక్

భూ సర్వే పరిష్కారానికి చర్యలు

- త్వరలో రానున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- ఈనెల 17 వరకు దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి జోన్: జిల్లాలో భూ సర్వే సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పలు మండలాల్లో సర్వేయర్ల కొరత తీవ్రస్థాయిలో ఉండటంతో భూ సర్వే సమస్యలు పేరుకుపోతున్నాయి. దీంతో లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అర్హతతో పాటు ఆసక్తి కలిగి ఉన్న వారిని ఎంపిక చేసి శిక్షణ అనంతరం లైసెన్స్‌లు జారీ చేయనున్నారు.

పరిష్కారానికి నోచుకోని భూ సర్వే సమస్యలు

గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి చట్టంతో వివిధ రకాల భూ సమస్యలు అధికమయ్యాయి. అందులోభాగంగా భూమి, సర్వే నంబర్ మిస్సింగ్‌తోపాటు వాస్తవంగా ఉన్న విస్తీర్ణం కంటే ఎక్కువ, తక్కువగా నమోదై ఉండటం, ఒక రిపేరుతో కాకుండా మరొకరిపేరుతో ఆన్‌లైన్‌లో చూపించటంతో పాటు అనేకరకాల సమస్యలు నెలకొన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి ప్రధానంగా సర్వేయర్లు అవసరం. జిల్లాలో చాలాచోట్ల ఇన్‌చార్జిలుగా వ్యవహరించడం, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిమగ్నమై ఉండటంతో భూ సర్వే సమస్యలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.



సర్వేయర్ల కొరత తీరుస్తూ ప్రతీ మండలానికి ఒక సర్వేయర్ ఉండాలి. అయితే జిల్లాలో మొత్తం 28 మండలాలకు గాను 15 మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారు. 1,67,948 సర్వే నంబర్లు, సుమారు 8 లక్షల ఎకరాల భూ విస్తీర్ణం కలిగి ఉంది. ఆయా మండలాల్లో సుమారు నాలుగువేలకు పైగా సర్వే కోసం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం అభ్యర్థుల నుంచి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 17 వరకు మీసేవ కేంద్రాల్లో రూ.100లు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్మీడియెట్‌లో గణిత శాస్త్రం ఒక సబ్జెక్టు కలిగి ఉండి 60% మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలి. ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్(సివిల్), డిప్లమో సివిల్, బీటెక్ సివిల్ లేదా ఇతర సమానమైన విద్యార్హతలు కలిగి ఉండాలి.

శిక్షణ ఫీజుల వివరాలు

ఓసీ అభ్యర్థులు	రూ. 10,000
బీసీ అభ్యర్థులు	రూ. 5,000
ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు	రూ. 2,500

60 మంది ఎంపికకు కసరత్తు

జిల్లాలో 60 మంది లైసెన్స్ సర్వేయర్ల ఎంపికకు సంబంధిత అధికారులు కసరత్తు చేస్తున్నారు. విద్యార్హతలను బట్టి ఎంపిక చేసిన వారికి 50 రోజుల పాటు శిక్షణనివ్వనున్నారు. అందులో ఉత్తీర్ణులైన వారికి 42 రోజులపాటు క్షేత్రస్థాయిలో సర్వేయర్ కింద శిక్షణనిస్తారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన వారికి రాష్ట్రస్థాయిలో నిర్వహించే పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి భూమి సమాచార నిర్వహణ విభాగం నుంచి లైసెన్స్ సర్వేయర్‌గా ఉత్తర్వులు జారీ చేస్తారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



లైసెన్స్ సర్వేయర్ కోసం ఆసక్తి ఉండి అర్హులైన వారు ఈ నెల 17 వరకు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి నిబంధనల మేరకు శిక్షణ అందించి లైసెన్సులు జారీ చేస్తారు.

–ఐనేష్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, సంగారెడ్డి

క్లుప్తంగా

యూరియా వినియోగం తగ్గించాలి : శాస్త్రవేత్త శోభ



మాట్లాడుతున్న డాక్టర్ శోభ

హవేళిఘణాపూర్(మెదక్): రైతులు గతంలో మాదిరిగా ఎరువు పేడ, గొర్రె ఎరువు లాంటి వినియోగం తగ్గినందున వాటికి బదులుగా మినుము, జనుము, జిలుగ విత్తనాలను వేసుకోవాలని వ్యవసాయ శాఖ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శోభ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ రైతువేదికలో మండలంలోని ఆయా గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. మోతాదుకు మించి యూరియా వాడకం వల్ల చీడపీడలు సోకి రైతులు నష్టపోతున్నారని అన్నారు. రైతులు దుక్కులు దున్ని పచ్చిరొట్టె, జిలుగు, మినుము చల్లి పారపెట్టినట్లయితే భూసారం పెరిగి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, ఏడీఏ విజయనిర్మల, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీ మృతి



కమలమ్మ (ఫైల్)

జహీరాబాద్ టౌన్: పని చేస్తున్న ప్రదేశంలో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని రాయిపల్లి(డి) గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కూలీల కథనం మేరకు.. మండలంలోని రాయిపల్లి(డి) గ్రామానికి చెందిన ఎర్రోల కమలమ్మ(65)తోటి కూలీలతో కలిసి ఉదయం ఉపాధి పనులకు వెళ్లింది. పనులు చేస్తుండగా అస్వస్థతకు గురై కింద పడిపోయింది. ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు వెంటనే జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు గుండెపోటుతో మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు జహీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మృతుడి ఆచూకీ లభ్యం



వెంకయ్య(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లి అటవీ ప్రాంతంలో ఆదివారం బయటపడ్డ గుర్తు తెలియని మృతుడి ఆచూకీ లభ్యమైంది. ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు.. ప్రకాశం జిల్లా ఉల్వపాడు మండలం చాగల్ల గ్రామానికి చెందిన తుల్లూరు వెంకయ్య(58) చేగుంట మండల కేంద్రంలో ఉండే తన కుమారుడి ఇంట్లో ఫంక్షన్ ఉంటే వచ్చాడు. మానసిక పరిస్థితి బాగాలేని అతడు మార్చి 23న ఇంటి నుంచి కన్పించకుండా పోయాడు. అప్పటి నుంచి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం అటవీ ప్రాంతంలో మృతదేహమై కనిపించాడు. కుటుంబీకులను పిలిపించి చూయించగా మృతదేహాన్ని గుర్తించారు. మృతిపై ఎలాంటి అనుమానంలేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల కిందట నిర్వహించిన వాహన తనిఖీల్లో 19 మంది మద్యం తాగి పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.34,500 జరిమాన విధించినట్లు తెలిపారు.

పటాన్‌చెరులో 27 మంది

పటాన్‌చెరు టౌన్: పటాన్ చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన డ్రంకైన్ డ్రైవ్‌లో 27 మంది మద్యం తాగి పట్టుబడినట్లు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపారు. వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 9 మందికి రూ.1,500, 17 మందికి రూ.1,000 చొప్పున, మరో వ్యక్తికి రూ. 2 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): కారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధి హామీ మహిళా కూలీలు గోప దేవవ్వ, బ్యాగరి చంద్రవ్వ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పీ.శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డి పేటలో ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్తున్న మహిళలను కారు ఢీకొట్టడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు అంత్యక్రియల నిమిత్తం రూ. 50 వేల చొప్పున కలెక్టర్ తన అత్యవసర నిధుల నుంచి చెల్లించేలా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇరు కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ. 2 లక్షల బీమాను రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. సిద్దిపేట-మెదక్ జాతీయ రహదారిపై ఉన్న గ్రామాల వద్ద తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు.

రాలిన ఆశలు.. నష్టాల్లో రైతులు

అకాల వర్షాలకు దెబ్బతిన్న మామిడి పంటలు

- అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడలో 2,991 ఎకరాల్లో సాగు
- మార్కెట్‌లోనూ ధర అంతంత మాత్రమే
- నష్ట పరిహారం ఇవ్వాలని రైతుల వినతి



కోహెడలో నేలరాలిన మామిడి కాయలు

కోహెడ(హుస్నాబాద్): ఆరుగాలం శ్రమించిన మామిడి రైతులకు నిరాశే దక్కింది. ఇటీవల కురిసిన గాలివానలతో కోత దశలో ఉన్న మామిడి కాయలు నేలరాలాయి. గాలి తీవ్రతకు చెట్ల కొమ్మలు సైతం విరిగి పడ్డాయి. దీంతో తీవ్ర స్థాయిలో తోటలు దెబ్బ తిన్నాయి. ఫిబ్రవరి నుంచి ఎండల తీవ్రత పెరిగింది. నీటి ఎద్దడితో చిరుకాయ దశలో ఉన్న మామిడి తోటలు సగానికి పైగా నేల రాలడంతో నష్టాల్లో మునిగిపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టన్నుకు రూ.15 వేలు దాటని వైనం

వర్షాలతో నేలరాలిన మామిడి కాయలను మార్కెట్‌కు తరలించిన రైతులకు టన్నుకు రూ.15 వేలు ధర అందని పరిస్థితి నెలకొంది. తోటలను ముందస్తుగా మాట్లాడుకున్న పలువురు వ్యాపారులు సైతం చేతులెత్తేశారు. గొట్లమిట్ట, కోహెడ, చెంచల్ చెర్వుపల్లి, తీగలకుంటపల్లి, వరికోలు, బస్వాపూర్, కాచాపూర్, సముద్రాల, శ్రీరాములపల్లి, కూరెల్లా, తంగాళ్లపల్లి, వింజపల్లి తదితర గ్రామాల్లో ఉద్యానశాఖ అధికారుల వివరాల ప్రకారం 1,350 ఎకరాలు మామిడి సాగు అవుతుంది. అకాల వర్షాలు, వాతావరణ మార్పులతో మామిడి పూత, కాత నిలువలేదు. కాస్తోకుస్తో నిలిచిన మామిడి కాయలు గాలివానకు పూర్తిగా నేలరాలాయి. హుస్నాబాద్ నియోజక వర్గంలోని కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో సుమారు 2,991 ఎకరాలు మామిడి సాగు చేస్తున్నారు.



పంట నష్టంపై సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పంట నష్టం వివరాలు సేకరణ

ఉద్యానశాఖ అధికారులు అకాల వర్షాలతో నష్టపోయిన మామిడి తోటల వివరాలు సేకరించడంలో బిజీబిజీగా ఉన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం కోహెడ మండల వ్యాప్తంగా 407 మంది రైతులకు చెందిన 1,255 ఎకరాల్లో 33 శాతం మామిడి దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. కాగా 90 శాతం మామిడి దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి



“పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఇటీవల గాలి వానతో మామిడి కాయలు పూర్తిగా నేలరాలాయి. రాలిన మామిడి కాయలను మార్కెట్‌కు తరలిస్తే.. టన్నుకు రూ.10వేలు కూడా ధర ఇవ్వలేదు. దీంతో తీవ్రంగా నష్టం జరిగింది. ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

– మ్యాకల రజనీకాంత్‌రెడ్డి, మామిడి రైతు, తీగలకుంటపల్లి

వివరాలు సేకరిస్తున్నాం



పండ్ల తోటల వివరాలు సేకరిస్తున్నాం. నష్ట పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. చాలా మంది రైతులు ఆన్‌లైన్‌లో పంట సాగు నమోదు చేసుకోలేదు. అలాంటి రైతుల వివరాలు కూడా సేకరిస్తున్నాం. అందరికీ నష్ట పరిహారం అందే విధంగా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

– బాలాజీ, ఉద్యానవన శాఖ అధికారి”

యుద్ధం ఎందుకు ఆపారో మోదీ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ట్రంప్ ట్విట్టర్‌తో యుద్ధాన్ని నిలిపివేసి దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మిగిల్చారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మన సైన్యం పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడి చేస్తుంటే ఎలాంటి చర్చలు లేకుండా ఎందుకు ఆపారో ప్రధాని మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రస్తుతం దేశమంతా ఇందిరాగాంధీని జ్ఞాపకం చేసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పక్షాన దేశ సరిహద్దుల్లో ఉన్న సైన్యానికి మద్దతుగా ర్యాలీలు చేపట్టామన్నారు. భారత ఆర్మీకి శాసన సభ్యులందరు నెల జీతం ఇచ్చారన్నారు. డామేజిని కంట్రోల్ చేసుకునేందుకే త్రివిధ దళాలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రధాని దమ్మున్న వ్యక్తి అయితే యుద్ధాన్ని ఎందుకు విరమించారో, జరిగిన నష్టమేమిటో పార్లమెంట్ వేదికగా చర్చకు పిలువాలని డిమాండ్ చేశారు. కాల్పుల విరమణ ప్రకటన చేసిన నాలుగు గంటల్లోనే కాల్పుల విరమణను ఉల్లంఘిస్తే మీరు ఏమి చేశారని ప్రశ్నించారు. పహల్గామ్‌పై చేసిన దాడి పాకిస్తాన్ చేసిందని ఎంఐఎం కూడా ముక్తకంఠంతో ఖండించిందన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

సిద్దిపేట ఏసీపీ మధు, టూ టౌన్ సీఐ ఉపేందర్



నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ మధు, సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్ హెచ్చరించారు. సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏసీపీ, సీఐ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్స్‌తో సిబ్బంది సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాలపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా యాంటి నార్కోటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండ్లికి చేసిన అప్పులతో మనోవేదనకు గురై..

- పురుగు మందు తాగిన మహిళ
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



సుశీల (ఫైల్)

వర్గల్(గజ్వేల్): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ ఘటన వర్గల్ మండలం గిర్మాపూర్‌లో చోటు చేసుకుంది. గౌరారం ప్రొబేషనరీ ఎస్ఐ కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గిర్మాపూర్‌కు చెందిన సాయిల్ల అశోక్, సుశీల(44) దంపతులకు సబిత, కల్పన, కార్తీక్ ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండేళ్ల కిందట పెద్ద కూతురు వివాహం కోసం కొంత అప్పు చేశారు. ఆ అప్పు విషయంలో సుశీల తరచూ బాధ పడేది. ఆదివారం ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన ఆమె గుర్తు తెలియని పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా అదే రోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త వేధింపులు తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య

సంగారెడ్డి క్రైమ్: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన సయ్యద్, బీబీ దంపతులకు ఒక్కతే కూతురు హబిదే. పుట్టుకతోనే మూగ అమ్మాయి. అదే కాలనీకి చెందిన గోరేమియాకు హబిదే (22)ను ఇచ్చి రెండేళ్ల కిందట వివాహం జరిపించారు. గోరేమియా వృత్తి రీత్యా పట్టణంలో పెయింటర్‌గా పని చేస్తుంటాడు. హబీనా కూడా టైలరింగ్ పని చేస్తుంది. మద్యానికి బానిసైన గోరేమియా ప్రతిరోజూ తాగి ఇంటికొచ్చి భార్యతో డబ్బుల కోసం గొడవపడేవాడు. ఆదివారం రాత్రి ఆమె తల్లి దండ్రుల ముందే గొడవపడి చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి బీబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు అదృశ్యం

ఇంటి నుంచి వెళ్లి నర్సు

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్ రెడ్డి కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఆర్.కే నగర్ కాలనీకి చెందిన నవనీత (21) బీరంగూడ లో ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తుంది. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై తండ్రి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పక్కింటి ఆమెతో గొడవపడి యువతి

పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన అంజమ్మ 7న ఇంటి పక్కనున్న స్వరూప అనే మహిళ ఇంటి ఆవరణలో చెట్టు నుంచి కరివేపాకు తీసుకొని వచ్చింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ పడింది. అంజమ్మ కూతురు శివలీల ఎందుకు తెచ్చావని తల్లిపై కోపంతో ఆ కరివేపాకును స్వరూపకు ఇచ్చేసింది. అనంతరం స్వరూపకు, శివలీలకు గొడవ జరగడంతో మనస్తాపం చెందిన శివలీల ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యం పై అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

మాసాయిపేటలో వ్యక్తి

చేగుంట(తూప్రాన్): ఇంట్లోంచి బయటకు వెళ్లి వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రమైన మాసాయిపేటకు చెందిన ఏశం కుమార్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 10న ఇంట్లోంచి వెళ్లిన కుమార్ కోసం బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమార్ భార్య బాలమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ధాన్యం కొనుగోలులో

50 బస్తాలు గోల్‌మాల్

- సుమారు రూ.47 వేల వరకు నష్టం
- న్యాయం చేయాలంటూ కౌలు రైతు ఆవేదన



బాధిత రైతు బైండ్ల భూమయ్య

పాపన్నపేట(మెదక్): కొనుగోలు కేంద్రంలో 50 బస్తాల ధాన్యం గోల్‌మాల్ జరిగినట్లు పాపన్నపేట కౌలు రైతు బైండ్ల భూమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. పాపన్నపేట పెద్ద హరిజన వాడ వద్ద ఐకేపీ సభ్యుల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన కౌలు రైతు బైండ్ల భూమయ్య, బట్టి భారతి, ప్రభాకర్, నదరి నారాయణ, చోటు, కుర్మ కిషన్‌కు చెందిన 766 బస్తాలతో లారీ లోడ్ చేశామన్నాడు. అందులో తనవి 391 బస్తాలు ఉన్నాయని, 389 బస్తాల వరకు లెక్క కట్టి డ్వాక్రా గ్రూపు సభ్యురాలు సంచిపై సంఖ్య రాసిందన్నారు. అనంతరం రెండు సంచులు తెచ్చి తూకం చేసి లెక్క రాయించానన్నారు. శనివారం ఉదయం ట్రక్ షీట్ లేకుండానే లారీ లక్ష్మీనగర్ ప్రాంతంలోని ఓ రైస్ మిల్లుకు వెళ్లిందన్నారు. ఆదివారం ఐకేపీ సభ్యులు తనకు చెందిన 50 ధాన్యం బస్తాలు తక్కువగా వచ్చినట్లు సమాచారం ఇచ్చారని వాపోయాడు. సుమారు 20 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా వచ్చిందంటున్నారని, దీంతో సుమారు రూ.47 వేల నష్టం వస్తుందన్నారు.

ట్రక్ షీట్ లేకుండానే లారీ వెళ్లింది

ఈ విషయమై కమ్యూనిటీ కో ఆర్డినేటర్ శివరాణిని వివరణ కోరగా.. అప్పటికే చీకటి కావడంతో కమిటీ మెంబర్లు లారీ పూర్తి స్థాయిలో లోడ్ కాక ముందే ఇంటికెళ్లారని అన్నారు. శనివారం పొద్దున కేంద్రం వద్దకు వచ్చే సరికి లారీ లోడ్ చేసుకొని ట్రక్ షీట్ లేకుండానే వెళ్లి పోయిందన్నారు. ట్రక్ షీట్‌పై కమిటీ మెంబర్ల సంతకాలు ఉంటాయన్నారు. అనంతరం 50 సంచులు తక్కువగా వచ్చినట్లు చెప్పారన్నారు. హమాలీలు కూడా క్వింటాల్‌కు రూ.40 తీసుకుంటున్నందున వారి వద్ద కూడా లారీలో ఎన్ని బస్తాలు వెళ్లిన లెక్క ఉండాలన్నారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నామని తెలిపారు.

వేర్వేరు చోరీల కేసులో ఇద్దరు రిమాండ్

సిద్దిపేటలో పార్కు చేసిన బైక్‌లు దొంగతనం



నిందితుడిని చూపుతున్న ఏసీపీ మధు, సీఐ వాసుదేవరావు, ఎస్ఐ నవత

సిద్దిపేటకమాన్: బైక్‌ల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట ఏసీపీ మధు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద గతేడాది మే నెలలో ద్విచక్ర వాహనాన్ని, ఈ ఏడాది జనవరిలో కోటిలింగాల టెంపులు వద్ద, రైతు బజార్ వద్ద, దుబ్బాకలో పార్క్ చేసిన బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, ఎస్ఐ నవత తమ సిబ్బందితో కలిసి సోమవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన శనిగరం శ్రీకాంత్ (30) పోలీసులను చూసి బైక్ వదిలిపెట్టి పారిపోతుండగా పట్టుకున్నారు. తమదైన శైలిలో విచారించగా పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి ఇంట్లో భద్రపర్చి తర్వాత ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు నిందితుడు చేసిన నేరాలు ఒప్పుకున్నాడు. వెంటనే రూ.2,55,000 విలువ గల ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన సీఐ వాసుదేవరావు, ఎస్ఐ నవత, సిబ్బంది భూమలింగం, శరత్‌బాబు, శేఖర్, రామకృష్ణను ఏసీపీ అభినందించి, సీపీ చేతుల మీదుగా రివార్డు అందజేస్తామని తెలిపారు.

పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన ఆటో డ్రైవర్

పటాన్‌చెరు టౌన్: వృద్ధురాలి పుస్తెలతాడు, నగదు ఎత్తుకెళ్లిన కేసులో ఆటో డ్రైవర్‌ను రిమాండ్ చేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన భారతి 9న బొల్లారం అల్వాల్‌లో ఉండే తన ఇంటికి వెళ్లి అక్కడ కిరాయిదారుడు నుంచి రూ.10 వేలు అద్దె తీసుకుంది. తిరిగి అదే రోజు సాయంత్రం కూకట్‌పల్లి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఆటో డ్రైవర్ వృద్ధురాలిని పలు వీధుల మీదుగా తిప్పి చివరకు అమీన్‌పూర్ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి ఐదున్నర తులాల పుస్తెలతాడు, రూ.10 వేల నగదు తీసుకొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాను పరిశీలించి ఆటో నంబర్ ఆధారంగా డ్రైవర్‌ను గుర్తించారు. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం మాదపురం కాలనీకి చెందిన ముడావత్ చిన్నను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించి అతడి వద్ద నుంచి పుస్తెలతాడు, రూ.7వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కి తరలించారు.

ప్రభుత్వ రోడ్డును కబ్జా నుంచి కాపాడండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చిన్నగొట్టిముక్ల గ్రామస్తులు

- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే అండతో స్థానికుల ఆక్రమణ
- కలెక్టరేట్ ఎదుట రైతులు నిరసన

మెదక్ కలెక్టరేట్: పంట పొలాలకు వెళ్లే ప్రభుత్వ రోడ్డుతోపాటు చెరువు శిఖం, కుంటలను కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొడిపల్లి మండలం చిన్న గొట్టిముక్ల గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ.. తమ గ్రామ శివారులోని సర్వే నం.292లో అన్ని కులాల వారికి సంబంధించి 95 ఎకరాలు భూమి ఉంది. సర్వే నం.264, 274, 275, 276లో సుమారు 55 ఎకరాల పట్టా భూమి ఉందన్నారు. ఈ భూముల్లో పంటలు వేసుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ భూముల్లోకి వెళ్లేందుకు తాత ముత్తాతల కాలం నుంచి 3 కిలో మీటర్ల మేర దారి ఉన్నట్లు తెలిపారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం రైతుల కోసం పనికి ఆహార పథకం కింద రోడ్డును బాగు చేసినట్లు తెలిపారు. కానీ ఈ దారిని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగుల రవీందర్‌రెడ్డి, స్థానికులు గడిల సుదర్శన్‌రావు కలిసి ధ్వంసం చేసి ఆక్రమించుకున్నట్లు ఆరోపించారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

సాంకేతిక విద్య.. బంగారు భవిత



జహీరాబాద్ శ్రీసంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

నేడే పాలిసెట్ ప్రవేశ పరీక్ష ● ఉమ్మడి మెదక్ జిల్లాలో 14 కేంద్రాలు

మూడేళ్లలో కోర్సు పూర్తి ● పారిశ్రామిక రంగాల్లో మెరుగైన ఉపాధి

జహీరాబాద్ టౌన్: విద్యార్థుల ఉజ్వల భవితకు సాంకేతిక విద్య తోడ్పనుంది. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన తర్వాత ఏం చదవాలి.. ఎలాంటి కోర్సులు తీసుకోవాలి.. ఏ విద్యాసంస్థల్లో చేరాలంటూ విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు మదన పడుతుంటారు. ఇలాంటి వారికి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు ఓ మంచి అవకాశం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలనుకునే వారికి పాలిటెక్నిక్ ఒక వరం లాంటిదని నిపుణులు సూచిస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు

సోమవారం (13న) పాలిసెట్(2025-26) పరీక్ష జహీరాబాద్ పట్టణంలోని రెండు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు జహీరాబాద్ శ్రీ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు ఉండగా సంగారెడ్డి జిల్లాలో 7 కేంద్రాలు ఉన్నాయి. జహీరాబాద్‌లో ఆర్ఎల్ఆర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు పరీక్ష సెంటర్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. విద్యార్థులు 30 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు.

ప్రవేశాలు ఇలా..

పదవ తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాయాలి. రాష్ట్ర సాంకేతిక శిక్షణ సంస్థ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసి ర్యాంక్ ఆధారంగా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చేరిన విద్యార్థులకు డిప్లొమా కోర్సుల్లో సెమిస్టర్ ప్రకారం శిక్షణ ఇస్తారు.

నేరుగా బీటెక్‌లోకి ప్రవేశం

మూడేళ్ల డిప్లొమా కోర్సు పూర్తి చేశాక.. పరిశ్రమల్లో వెంటనే ఉద్యోగం సంపాదించుకోవచ్చు. ఉన్నత విద్య కావాలంటే కూడా అందుకు అవకాశాలు ఉన్నాయి. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు పూర్తియ్యాక ఈసెట్ రాసి.. నేరుగా ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్‌లో చేరవచ్చు. మూడేళ్లలో ఇంజనీరింగ్ పూర్తి అవుతుంది. పాలిటెక్నిక్‌లో కంప్యూటర్స్, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ ఇంజనీర్, లాంటి కోర్సులు ఉంటాయి. ఇంజనీరింగ్‌లో కూడా పాలిటెక్నిక్‌లో చదివే సబ్జెక్టులే ఉంటాయి. పాలిటెక్నిక్ తర్వాత ఇంజనీరింగ్ చేస్తే సులువుగా సబ్జెక్ట్‌పై పట్టు వస్తుంది. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కంటే కూడా పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన వారికి కంపెనీలు అధిక ప్రాధాన్యం ఇస్తాయి.